క్లుప్తంగా

విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలంలో ఉన్న ఏడు ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థులకు ఐకేపీ ఆధ్వర్యంలో బుధవారం స్నాక్స్ పంపిణీ చేశామని ఏపీఎం ప్రేమలత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్ ఉండడంతో ఐకేపీ ఆధ్వర్యంలో వారికి ప్రతి రోజూ విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేస్తామన్నారు. కార్యమంలో ఐకేపీ సీసీ పురుషోత్తం, ఉపాధ్యాయ సిబ్బంది రమేశ్, రుక్మిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు సాధ్యమైనంత వరకు సేంద్రియ ఎరువులనే వాడాలని సర్పంచ్ అశోక్‌గౌడ్ అన్నారు. బుధవారం చిలప్‌చెడ్ మండలం అంతారం గ్రామంలో గల పలువురు రైతులకు సర్పంచ్ సహస్ర లైఫ్ సైన్స్ వారి సేంద్రియ ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సహస్ర లైఫ్ సైన్స్ ఏరియా మేనేజర్ వీరేశం, అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. తరచూ రసాయన ఎరువులు వాడకంతో నేల సారవంతాన్ని కోల్పోతుందన్నారు. కార్యక్రమంలో గణేష్, వార్డు సభ్యుడు చెన్నయ్య, రైతులు కొమురయ్య, శ్రీశైలం, సత్యనారాయణ గౌడ్, రాజు లచ్చయ్య పాల్గొన్నారు.

వెల్దుర్తి ఎంపీడీఓగా వెంకటలక్ష్మమ్మ



వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండల ఎంపీడీఓగా వెంకటలక్ష్మమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వెల్దుర్తిలో పనిచేసిన ఎంపీడీఓ జగదీశ్వరాచారి డిప్యూటేషన్‌పై పాపన్నపేటకు వెళ్లగా నిజాంపేటలో పనిచేసిన వెంకటలక్ష్మమ్మ డిప్యూటేషన్‌పై వెల్దుర్తికి వచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా వెంకటలక్ష్మమ్మ ప్రకటించారు.

పాపన్నపేట.. జగదీశ్వరాచారి



పాపన్నపేట(మెదక్): పాపన్నపేట ఎంపీడీఓగా జగదీశ్వరాచారి బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. వెల్దుర్తి ఎంపీడీఓగా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ కొడిపల్లికి బదిలీపై వెళ్లారు.

చిన్నశంకరంపేట.. అనిల్




చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట ఎంపీడీఓగా కె.అనిల్ బుధవారం విధుల్లో చేరారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన గంగుల గణేశ్‌రెడ్డి డిప్యూటేషన్‌పై కొల్చారం మండల ఎంపీడీఓగా బదలీ అయ్యారు. ఇక్కడికి వచ్చిన కె.అనిల్ కొల్చారం ఎంపీడీఓగా పనిచేశారు. బుధవారం విధుల్లో చేరిన వెంటనే భాగిరథపల్లిలో కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు.

కొడిపల్లి.. శ్రీనివాస్



కొడిపల్లి(నర్సాపూర్): కొడిపల్లి ఎంపీడీఓగా పి.శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీఓ భారతి టేక్మాల్ మండలానికి బదిలీ అయింది. పాపన్నపేట మండలం ఎంపీడీఓగా విధులు నిర్వహించే శ్రీనివాస్ కొడిపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి అధికారులు, నాయకులు సహకరించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కొల్చారం.. గణేశ్‌రెడ్డి



కొల్చారం(నర్సాపూర్): కొల్చారం మండలం నూతన ఎంపీడీఓగా బుధవారం గణేశ్‌రెడ్డి బాధ్యతలను చేపట్టారు. అంతకుముందు ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ చిన్న శంకరంపేటకు బదిలీపై వెళ్లారు. ప్రజల, ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల అభివృద్ధిలో తన వంతు బాధ్యతను చేపడుతానని గణేష్ రెడ్డి పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలో పేకాట ఆడుతున్నవారిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం నందగోకుల్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకుని కేస నమోదు చేశామన్నారు. వారి నుంచి రూ.11,210 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నైపుణ్యాలు మెరుగుపర్చేలా బోధించాలి

చేగుంట(తూప్రాన్): విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపర్చేలా బోధన చేయాలని జిల్లా విద్యాధికారి రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని వడియారం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. బోధన అభ్యసన సామగ్రిని ఉపయోగించి విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నవాతు సురేష్, ఉపాధ్యాయులు వసంత, సంతోషిమాత, అమరేశ్వరీ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు ఏర్పాట్లు పూర్తి



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్‌లో కంటివెలుగు ఏర్పాట్లు పూర్తి చేసిన సర్పంచ్, కార్యదర్శులు



కొడిపల్లి(నర్సాపూర్): ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఏఓ శ్రీకాంత్‌రెడ్డి

కొడిపల్లి(నర్సాపూర్): కంటి వెలుగు వైద్యశిబిరం ఏర్పాట్లను మండలం ప్రత్యేకాధికారి, డీఏఓ (జిల్లా ఆడిట్ అధికారి) శ్రీకాంత్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. కొడిపల్లి సీహెచ్‌సీ ఆవరణలో కంటి వెలుగు వైద్యశిబిరాన్ని ప్రారంభించినున్నారు. దీంతో ఏర్పాట్లను వైద్యసిబ్బందితో కలిసి పరిశీలించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని జాజితండాలో ఏర్పాటు చేసే వైద్యశిబిరం పనులను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయనిర్మల పరిశీలించారు. కార్యక్రమంలో జాజితండా సర్పంచ్ రమేశ్, మండల ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): నేడు మండల పరిధిలోని చిట్కుల్, బండపోతుగల్ గ్రామాల్లో కంటివెలుగు కార్యక్రమం ప్రారంభం కానుందని సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, ఇస్తారి, కార్యదర్శులు తిరుపతి, ఆనంద్‌లు అన్నారు. బుధవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరు గ్రామాలలో కంటివెలుగు కార్యక్రమానికి పూర్తి ఏర్పాట్లు చేశామని, కంటివెలుగుకు సంబంధించిన పరికరాలు వచ్చాయన్నారు. కంటి పరీక్షలలో వృద్ధులు ప్రథమ స్థానం ఉంటుందన్నారు. కంటి జబ్బులు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటతోపాటు, కొంతన్‌పల్లి గ్రామాల్లో గురువారం కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించనున్నట్టు ఎంపీడీఓ నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా సంఘాల లీడర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని తుక్కాపూర్, సీతారాం తండాల్లో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కొల్చారం, రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు రమేశ్, హర్షిత బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకొని కార్యక్రమం విజయవంతం చేయాలని పేర్కొన్నారు.



శివ్వంపేట(నర్సాపూర్): సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ

ఉపాధ్యాయులు లేక బడికి తాళం

- పిల్లలను ఇంటికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు
- వెంకటాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితి

రేగోడ్(మెదక్): పాఠశాలకు ఉపాధ్యాయులు రాలేదని తల్లిదండ్రులు విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లారు. ఈ ఘటన రేగోడ్ మండలంలోని వెంకటాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం చోటు చేసుకుంది. ఈ పాఠశాలలో 45 మంది విద్యార్థులు ఉండగా, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరు డిప్యూటేషన్‌పై వెళ్లగా, మరొకరు పాఠశాలకు గైర్హాజరయ్యారు. ఇద్దరికీ ఇద్దరూ బడిలో లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసేదేమీ లేక తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లడంతో బడికి తాళం పడింది. ఉపాధ్యాయులు లేకుండా తమ పిల్లలను బడికి ఎలా పంపించాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం ఫలితంగా విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సమస్య తలెత్తకుండా చర్యలు

పై విషయమై స్థానిక ఇన్‌చార్జ్ ఎంఈఓ బుచ్చానాయక్‌ను వివరణ కోరగా.. వెంకటాపూర్ పాఠశాలలో ఒకరు డిప్యూటేషన్, మరొకరు సెలవుపై వెళ్లారు. సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.



పాఠశాలకు తాళం వేసిన దృశ్యం



ఉపాధ్యాయుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

క్రీడలతోనే మానసిక, శారీరక దృఢత్వం



కిట్లు అందిస్తున్న సునీతారెడ్డి, తదితరులు

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. బుధవారం చిలప్‌చెడ్ ఫైజాబాద్ గ్రామంలో ఎంపీపీ వినోదరెడ్డి, స్థానిక సర్పంచ్ మనోహర రెడ్డితో కలిసిన టెంట్ హౌస్‌ను ప్రారంభించారు. అనంతరం సునీతారెడ్డి కుమారుడు శశిధర్‌రెడ్డితో కలసి గ్రామ యువకులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అశోక్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, జిల్లా రైతు సమన్వయ సభ్యుడు సయ్యద్‌హుస్సేన్, కో ఆప్షన్ సభ్యుడు షఫీ, నాయకులు గోపాల్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, సంగాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ముకుందారెడ్డి, నర్సింహ్మారెడ్డి, విఠల్, గోపాల్‌రావు, భీమయ్య, వీరస్వామి, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పంపిణీ



విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్న దృశ్యం

కొడిపల్లి(నర్సాపూర్): పదో తరగతి విద్యార్థులకు డీఆర్‌డీఏ ఐకేపీ ఆధ్వర్యంలో ప్రతీ రోజు సాయంత్రం స్నాక్స్ పంపిణీ చేయనున్నట్లు ఏపీఎం సంగమేశ్వర్ తెలిపారు. బుధవారం కొడిపల్లి ఉన్నత పాఠశాలలో అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాలమేరకు పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున వారికి మార్చి 21 వరకు ప్రతీ రోజు సాయంత్రం అరటి పండ్లు, అటుకులు, బిస్కెట్లు తదితర స్నాక్స్ అందించనున్నట్లు తెలిపారు. మండలంలో విద్యార్థులకు ఐకేపీ ద్వారా మహిళా సంఘం సభ్యులు స్నాక్స్ అందజేస్తారన్నారు. కార్యక్రమంలో పీడీ రమేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ జగన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాగౌడ్ ఆశయసాధనకు కృషి చేయాలి



రామాగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

పెద్దశంకరంపేట(మెదక్): దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతపారిశ్రామిక సంస్థ మాజీ చైర్మన్ విగ్రాం రామాగౌడ్ ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ప్రజాప్రతినిధులు అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో విగ్రాం రామాగౌడ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవ రెడ్డి, కేంద్ర ఎఫ్‌సీఐ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రాంచరణ్, పేట వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్ మాట్లాడారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్, చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్ మహంకాళి కృష్ణమూర్తి, నాయకులు దాచ సంగమేశ్వర్, దాదిగారి గంగాధర్, సాయిలు, గంగాధర్‌గౌడ్, రాజన్‌గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ల ఆవిష్కరణ

చిన్నశంకరంపేట(మెదక్): ఎస్‌జీటీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో చిన్నశంకరంపేటలో బుధవారం కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌జీటీ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు నర్సింహులు, శ్రీనివాస్, కోశాధికారి ప్రవీణ్ కుమార్, లక్ష్మీ, బాలమణి, గోపాల్, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో..

చిన్నశంకరంపేట శ్రీ సోమేశ్వరాలయం వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాములు, మండల అధ్యక్షుడు తలకొక్కుల శ్రీనివాస్, డాక్టర్ సత్యనారాయణ, ఎర్రగంటి కిష్టయ్య, నర్సింహులు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేటలో ఎస్‌జీటీ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు

నర్సాపూర్ రూరల్: ఆటోల్లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం మండలంలోని కాగజ్ మద్దూర్‌లో వాహన తనిఖీలు చేపట్టామని సీఐలు రామిరెడ్డి, సతీష్ రెడ్డి, మీరా, డీటీ సాధిక్ తెలిపారు. రెండు ఆటోల్లో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆటోలను సీజ్ చేసి బియ్యాన్ని ఎఫ్‌సీఐ గోదాంకు తరలించాలన్నారు.

మహాధర్నా కరపత్రాలు విడుదల



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

కొల్చారం(నర్సాపూర్): దళిత బంధు పథకంలో నిరుపేదలైన దళితులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని మాదిగ ఫెడరేషన్ స్టూడెంట్ (ఎంఎస్‌ఎఫ్)యూనియన్ మండల అధ్యక్షుడు పుర్రం మహేశ్ డిమాండ్ చేశారు. బుధవారం సంగాయిపేట గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఫిబ్రవరి 14న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద రాష్ట్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న మహా ధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మహేశ్.. ప్రభుత్వం 500 మందికి పథకాన్ని వర్తింపజేస్తామని చెబుతున్నా జనాభా ప్రాతిపదికన మరింత మందికి ఈ పథకం ద్వారా అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో దుర్గయ్య, యాదయ్య, నవీన్, ఏసు, కుమార్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి



పండ్లు అందజేస్తున్న ఎంపీపీ నవనీత

మనోహరాబాద్(తూప్రాన్): పదో తరగతి చదువుతున్న విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ పురం నవనీతరవి అన్నారు. బుధవారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నందున వారికి రోజు స్నాక్స్ ఇచ్చే కార్యక్రమాన్ని ఎంపీపీ పురం నవనీతరవి ప్రారంభించారు. అధికారుల ఆదేశాల మేరకు పైలట్ ప్రాజెక్ట్ కింద స్నాక్స్ అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు స్నాక్స్ అందజేయాడానికి ఎంపిక చేసిన మహిళా సంఘం సభ్యురాలు రోజు అందజేస్తారన్నారు. మండలంలోని 7 ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలలో స్నాక్స్ అందజేస్తున్నట్లు మహిళా సమైఖ్య సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నత్తి లావణ్య, ఏపీఓ పెంటాగౌడ్, హెచ్‌ఎం సత్యం, నాయకులు పెంటన్న, కందల రవి తదితరులున్నారు.

ఖమ్మం సభకు తరలిన నేతలు



అల్లాదుర్గం(మెదక్): సభకు వెళ్తున్న నాయకులు



నర్సాపూర్ : సభకు వెళ్తున్న మదన్‌రెడ్డి, నాయకులు

అల్లాదుర్గం(మెదక్): బీఆర్‌ఎస్ పార్టీ అల్లాదుర్గం మండల నేతలు ఖమ్మంలో జరిగే సభకు బుధవారం తరలి వెళ్లారు. మండల పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి ఆధ్వర్యంలో డైరెక్టర్లతో కలిసి వెళ్లారు. సభకు వెళ్లినవారిలో డైరెక్టర్లు అతినారం చెన్నప్ప, రవి, పద్మా తదితరులు ఉన్నారు.

నర్సాపూర్: ఖమ్మంలో బుధవారం జరిగిన బీఆర్‌ఎస్ బహిరంగ సభకు నర్సాపూర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి నాయకత్వంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సాపూర్‌తోపాటు నియోజకవర్గంలోని మండలాల నుంచి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ సంచలనం సృష్టిస్తుందన్నారు.



ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

నర్సాపూర్: నర్సాపూర్‌లోని శ్రీ శీతలమాత (నల్ల పోచమ్మ) ఆలయ 7వ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభయ్యాయి. ఉత్సవాలు మూడు రోజులపాటు జరగనున్నాయి. ఉత్సవాలలో భాగంగా లక్ష పుష్పార్చన జరిగింది. మహిళలు భారీగా పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేశారు.

పుష్పార్చన పూజలో మహిళలు

చిన్న ఆలోచన మహా ఆవిష్కరణకు మూలం

పాపన్నపేట(మెదక్): ఓ చిన్న ఆలోచన మహా ఆవిష్కరణకు మూలమవుతుందని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్యానల్ టీం వైద్య సలహాదారుడు డాక్టర్ ఉపేందర్ అన్నారు. బుధవారం తాను చదువుకున్న పాపన్నపేట ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ప్రతీ విద్యార్థి పరిశోధనాత్మక ఆలోచన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు గొప్ప ఆశయాలను పెట్టుకోవాలన్నారు. చంద్రుడిని చేరుకోవాలనే సంకల్పం కనీసం నక్షత్రాలనైనా చేరుతుందన్నారు. సర్కారు బడిలో ఉపాధ్యాయులు ప్రయోగాలపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రశ్నించే తత్వం పెరిగినపుడే విద్యార్థిలో పరిశోధన అంశంపై జిజ్ఞాస పెరుగుతుందన్నారు. కేన్సర్ వ్యాధిపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వందన, విజయలక్ష్మి, ఎంఈఓ నీలకంఠం, మాజీ ఎంఈఓలు మహేందర్‌రెడ్డి, మోహన్‌రాజు, హెచ్‌ఎం హరిసింగ్, నోడల్ అధికారి అంజాగౌడ్, వీరేశం, సర్పంచ్‌లు బాపురెడ్డి, గురుమూర్తి గౌడ్, ఎంపీటీసీ శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సైంటిస్ట్ ఉపేందర్

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కార్యాచరణ

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ముందుకు సాగేందుకు అవసరమైన కార్యచరణ కోసం యూత్ జోడో బూత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేటలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గ్రామ గ్రామాన బూత్‌కు ఐదుగురు సభ్యులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేసి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణ, ఓయూ జేఏసీ నాయకుడు మోహన్ నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్, మండల యూత్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, రవిచంద్, వెంకట్‌గౌడ్, పద్మారావు, శ్రీను, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి